సాక్షి జనగామ

మంగళవారం । 24 । డిసెంబర్ । 2024



అంతర్రాష్ట్ర గంజాయి ముఠా అరెస్ట్

అంతర్రాష్ట్ర ముఠాను అరెస్ట్ చేసి భారీ స్థాయిలో గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ కిరణ్ ఖరే తెలిపారు. - 8లో▸



ఓరుగల్లుకు ఒరిగిందేమీ లేదు

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంవత్సర పాలన కాలంలో ఓరుగల్లుకు ఒరింగిదేమీ లేదని మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం $31^0/20^0$

వాతావరణం

ఉదయం నుంచి చల్లని వాతావరణం ఉంటుంది. ఆకాశం అధిక శాతం మేఘావృతమై మధ్యాహ్నం ఉష్ణోగ్రతలు మామూలుగా ఉంటాయి. రాత్రి సమయంలో చలి తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

ఎస్‌హెచ్‌ఓగా మునవ్ భట్ బాధ్యతలు



జనగామ: జనగామ పట్టణ ఎస్‌హెచ్‌ఓగా మునవ్ భట్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఐపీఎస్–2023 బ్యాచ్‌కు చెందిన ఆయన శిక్షణ(ప్రొహిబిషన్)లో భాగంగా ఇక్కడికి వచ్చా రు. ఈ సందర్భంగా ఏసీపీ పార్థసారథి, సీఐ దామోదర్‌రెడ్డి మునవ్ భట్‌కు స్వాగతం పలికారు.

28న జాబ్ మేళా

జనగామ రూరల్: జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులు అమోజాన్ కంపెనీకి సంబంధించి జనగామ భూపాలపల్లిలో ప్లేస్ మెంట్ కోసం ఈనెల 28న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనా అధికారి ఎం.మల్లయ్య ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత, ఆసక్తి ఉన్నవారు బయోడేటా, సంబంధిత సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలతో కలెక్టరేట్‌లోని మీటింగ్‌హాల్ –8లో ఉదయం 10.30 గంటలకు నిర్వహించే ఇంటర్వ్యూకు హాజరు కావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 7995430401 నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

వెండర్స్‌తో కమిటీ ఏర్పాటు చేయాలి

జనగామ రూరల్: పట్టణంలో వెండర్స్ పెరుగుతున్నారు.. వారిని గుర్తించి మున్సిపల్ కమిషనర్, కలెక్టర్ పర్యవేక్షణలో కమిటీ వేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సుంచు విజేందర్ కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం విజేందర్ మాట్లాడుతూ.. మున్సిపల్, పోలీస్ అధికారులు అభివృద్ధి, ట్రాఫిక్ నిబంధనల పేరుతో చిరు వ్యాపారాలను ఇబ్బందులు పెట్టడం సరికాదన్నారు. తోపుడుబండ్ల చిరు వ్యాపారుల సంక్షేమ సంఘం గౌర వ సలహాదారు బూడిద గోపి, కన్వీనర్ మెండే రమేష్, కోకన్వీనర్లు మధు, మమత, శంకర్, రమ్య, లక్ష్మి, సాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

యుద్ధ ప్రాతిపదికన విద్యుత్ పనులు



స్టేషన్‌ఘన్‌పూర్: యుద్ధ ప్రాతిపదికన విద్యుత్ పనులు చేపడుతున్నామని ఎన్పీడీసీఎల్ డీఈ వై.రాంబాబు అన్నారు. స్థానిక 132/33 కేవీ సబ్ స్టేషన్‌లో సోమవారం చేపట్టిన విద్యుత్ మరమ్మతు పనులను పరిశీలించిన ఆయన మాట్లాడుతూ.. ఘన్‌పూర్‌లో లోఓల్టేజీ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేలా ప్రత్యేక ప్రణాళికతో పనిచేస్తున్నట్లు తెలిపారు. బస్టాండ్ ఏరియాలో ఎస్ఎస్ 86/100 కేవీఏ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు అనుసంధానంగా 100 కేవీఏ సామర్థ్యం కలిగిన మరో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టౌన్ ఏఈ పి.శంకర్, ఏఈ టెక్నికల్ భువనేశ్వరి, సబ్‌ఇంజనీర్ హరిత, ఫోర్‌మన్ వై.రాజేందర్, లైన్ ఇన్స్పెక్టర్ ఓ.యాదగిరి, లైన్‌మన్‌లు వాసం శ్రీధర్‌పటేల్, ఎండీ.అన్వర్‌పాషా, పి.సందీప్ పాల్గొన్నారు.

రైతు పక్షపాతి సీఎం రేవంత్‌రెడ్డి



జనగామ: రైతు పక్షపాతి సీఎం రేవంత్‌రెడ్డి.. అన్నదాతల సంక్షేమానికి అకుంఠిత దీక్షతో కృషి చేస్తున్నారని జనగామ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ బనుక శివరాజ్‌యాదవ్ అన్నారు. జాతీయ రైతు దినోత్సవం సందర్భంగా సోమవారం మార్కెట్ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రైతు విగ్రహాలకు ప్రత్యేక పూజల అనంతరం రైతులను సత్కరించి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ రైతును రాజు చేయడమే ప్రభుత లక్ష్యమని, అందులో భాగంగా రైతుభరోసా, పంట రుణమాఫీ తదితర పథకాలు అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మార్కెట్‌కు పంట ఉత్పత్తులను తీసుకువచ్చే రైతులకు కనీస మౌలిక వసతుల కల్పనపై దృష్టి పెట్టినట్లు తెలిపారు. రైతు సంఘం నాయకుడు ఎం.కనకారెడ్డి, పీసీసీ సభ్యుడు చెంచారపు శ్రీనివాస్‌రెడ్డి ప్రసంగించగా.. మార్కెట్ ప్రత్యేక శ్రేణి కార్యదర్శి శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్లు గొంగిడి నర్సిహారెడ్డి, రవీందర్, ఏఎంసీ డైరెక్టర్లు, సూపర్‌వైజర్లు, కాంగ్రెస్, సేవాదళ్ నాయకులు శ్రీలతరెడ్డి, నాగబండి రవీందర్, భానోత్ బన్సీనాయక్, కుమార్, శ్రీనివాస్, నాగార్జున, లింగాల నర్సిరెడ్డి, సుంకరి శ్రీనివాస్‌రెడ్డి, దాసరి శేఖర్, బడికె కృష్ణస్వామి పాల్గొన్నారు.

తీరని సమస్యలు

- గ్రీవెన్స్‌కు 76 వినతులు
- తిరగడమే తప్ప తీర్చేది లేదా.. అంటూ అర్జీదారుల ఆవేదన
- దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి : కలెక్టర్ ఆదేశం



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా

జనగామ రూరల్: అర్జీలు పట్టుకుని అధికారుల వద్దకు తిరగడమే తప్ప సమస్యలు తీరడంలేదంటూ ప్రజలు వాపోతున్నారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌కు వివిధ సమస్యలపై 76 వినతులు రాగా.. వాటిని కలెక్టర్ రిజ్వాన్ బాషా, అర్డీఓ వెంకన్నతో కలిసి స్వీకరించారు. దరఖాస్తులను పరిశీలించి సమస్యలు సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ధరణి పెండింగ్ దరఖాస్తుల్లో అన్ని మాడ్యూల్స్ పూర్తిచేయాలని, మండల స్థాయిలో ప్రజావాణి సక్రమంగా నిర్వహించి వినతులు పెండింగ్‌లో లేకుండా చర్యలు చేపట్టాలని చెప్పారు. కుల, ఆదాయ, ఈబీసీ, మ్యారేజ్ తదితర ధ్రువీకరణ పత్రాల జారీ వేగవంతం చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు సుహాసిని, హనుమాన్ నాయక్, జెడ్పీ డిప్యూటీ సీఈఓ సరిత, డీఆర్‌డీఓ వసంత, డీఏఓ రామారావు నాయక్, డీఎంసీఎస్ హతీరాం, డీసీఎస్‌ఓ సరస్వతి, డీడబ్ల్యూఓ ఫ్లోరెన్స్ తదితరులు పాల్గొన్నారు.

అర్జీల్లో కొన్ని ఇలా..

- రెవెన్యూ శాఖకు సంబంధించి ధరణి పోర్టల్‌లో తన భూమి 4.20 ఎకరాలకు 2.16 ఎకరాలుగా నమోదైంది. మిగతా రెండెకరాలు ధరణిలో నమోదు చేయాలని దేవరుప్పుల మండలం కామారెడ్డి గూడెంకు చెందిన దండు సోమయ్య దరఖాస్తు ఇచ్చారు.
- ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తు చేసుకోనందున తనకు తెల్ల రేషన్ కార్డు మంజూరు చేయాలని కోరుతూ జిల్లా కేంద్రం సంజయ్ నగర్‌కు చెందిన ఉషా జాటవ్ అర్జీ పెట్టుకున్నారు.
- అద్దెకు ఉంటున్న తాను ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద దరఖాస్తు చేసుకోగా పేరు రాలేదని, పరిశీలించి నమోదు చేయలని జనగామ మున్సిపల్ పరిధి రెండో వార్డుకు చెందిన లగిశెట్టి సునీత వినతిపత్రం ఇచ్చారు.
- మా తాత పేరు మీద ఉన్న 1.30 గుంటల భూమిని వారసత్వ ఆస్తిగా తమ పేరుమీదకు మార్చాలని బచ్చన్నపేట మండలం అలీంపూర్ గ్రామానికి చెందిన పాకాల నర్సయ్య, కనకయ్య విజ్ఞాపన పత్రం ఇచ్చారు.
- కొడకండ్ల మండలం రామవరం గ్రామానికి చెందిన మచ్చ సునీత.. తన ఒక ఎకరం గుంట భూమికి సంబంధించి యాజమాన్యపు హక్కు పత్రం కొత్తది జారీ చేయాలని కలెక్టర్‌కు దరఖాస్తు అందజేశారు.



పై ఫొటోలో కనిపిస్తున్న అమంచ అఖిల, నిఖిల మానసిక దివ్యాంగులు. పట్టణంలోని గుండ్లగడ్డకు చెందిన వీరి తండ్రి ఇంటి నుంచి వెళ్లిపోగా తల్లి రమాదేవి బీడీలు చుట్టి పిల్లలను పోషించుకుంటోంది. నిలువ నీడలేదు. అద్దె ఇంట్లో ఉంటూ పింఛన్ డబ్బులతో నెట్టుకు వస్తున్నది. ఆర్థిక ఇబ్బందులతో అద్దె కూడా చెల్లించలేని పరిస్థితి నెలకొంది. 'తమకు డబుల్ బెడ్రూం ఇల్లు మంజూరు చేసి ఆదుకోవాలని' రమాదేవి కలెక్టర్‌ను వేడుకుంది.

17 గుంటల భూమి ఆక్రమించారు



గ్రామంలోని 177బీ సర్వేనంబర్‌లో 17 గుంటల భూమి నా పేరున ఉంది. కనకదుర్గా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ కంపెనీ వారు నా సర్వే నంబర్ పక్కనే ఉన్న భూమి కొనుగోలు చేశారు. అందులో నాకు రావలసిన భూమి కలుపుకుని 177బీ1తో అక్రమంగా పట్టా చేసుకున్నారు. సర్వే చేసి భూమి ఇప్పించి న్యాయం చేయాలి.

- శివరాత్రి లక్ష్మయ్య, కోమల్ల(రఘునాథపల్లి)

వితంతు పింఛన్ ఇప్పించండి



నా భర్త సిద్ధారెడ్డి గ్రామంలో చెట్టు విరిగి పడి 2021లో మృతి చెందాడు. ఏ ఆసరా లేదు. వితంతు పింఛన్‌తో పాటు ఇందిరమ్మ ఇల్లు ఇప్పించి ఆదుకోవాలి. ఆరు గ్యారంటీలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయలేదు. సర్వేలో నమోదుచేయాలి.

- ఇదునూరి రేవతి, పెద్దపహాడ్, జనగామ మండలం

భూమికి దారి లేదంటున్నారు



తండాలోని సర్వే నంబర్ 1106/జీలో ఒక ఎకరం భూమి మా తండ్రి భూక్య బిక్కు పేరు మీద ఉంది. 40 ఏళ్ల నుంచి సాగు చేసుకుంటున్నాం. పక్కన ఉన్న వారు మా భూమికి దారి లేదని మూసి వేశారు. జీవనాధారంగా ఉన్న భూమిని సాగు చేసుకోనివ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారు. తహసీల్దార్ వద్దకు వెళ్లినా న్యాయం చేయడం లేదు. విచారణ చేపట్టి పొలానికి దారి చూపించాలి.

- భూక్య దూలీ, కుసుంబాయితండా(రఘునాథపల్లి)

బ్లాక్‌బెర్రీ.. ముస్తాబు



ములుగు జిల్లా తాడ్వాయి–పస్రా మధ్య ఏటూరునాగారం అభయారణ్యంలోని జలగలంచ వాగు సమీపాన ఉన్న బ్లాక్ బెర్రీ దీవిని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతున్నారు. ఎకో టూరిజంలో భాగంగా ఐదు ఎకరాల విస్తీర్ణం ఉన్న ఇసుక తిన్నెపై ఆధునిక గుడారాలు సిద్ధమయ్యాయి. రెస్టారెంట్, క్యాంప్‌ఫైర్, ఇసుకలో ఆటలు ఆడుకునేలా ఏర్పాట్లు చేస్తున్నారు. సోమవారం రాత్రి విద్యుత్ వెలుగుల్లో దీవి కాంతులీనింది. – ఎస్‌ఎస్‌తాడ్వాయి

- వివరాలు 8లో▸

సంక్రాంతి వరకు సాగు నీరు అందించాలి

- ఎమ్మెల్యే కడియం శ్రీహరి



సమీక్ష సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే, కలెక్టర్

జనగామ రూరల్: సంక్రాంతి నాటికి ఘనపూర్ నియోజకవర్గంలోని చివరి ఆయకట్టు వరకు సాగు నీరు అందించాలని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ రిజ్వాన్ బాషాతో కలిసి కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. నియోజకవర్గ పరిధిలోని దేవాదుల ఎత్తిపోతల ప్రాజెక్టు కింద భూసేకరణ ప్రక్రియ సత్వరమే పూర్తి చేయాలని, యాసంగి పంటలకు అన్ని రిజర్వాయర్ల కింద ఉన్న చెరువుల్లో నీటిని నింపాలని చెప్పారు. జలవనరుల్లోని గుర్రపు డెక్క, చెత్తా చెదారం తొలగించాలని అన్నారు. అశ్వరావుపల్లి రైట్ మెయిన్ కెనాల్, ధర్మసాగర్, నవాబుపేట, ఉప్పుగల్లు తదితర కెనాల్ పనులు త్వరగా పూర్తిచేయాలన్నారు. అధికారులు మెయింటనెన్స్, నీటి నిర్వహణపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని సూచించారు. సమావేశంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ లావణ్య రెడ్డి, ఆర్డీఓలు గోపీరాం, వెంకన్న, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు సుహాసిని, హనుమాన్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సర్వే వేగవంతం చేయాలి : కలెక్టర్

జనగామ: జిల్లాలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్డీఓ వెంకన్నతో కలిసి అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్ల సర్వేకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రత్యేక అధికారులు పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీఓలను సమన్వయం చేసుకుని విజయవంతంగా పూర్తి చేయాలన్నారు. అలాగే కలెక్టరేట్ ఏరియాతో పాటు ఫ్లోర్స్, శాఖల వారీగా చాంబర్లు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. సమీక్షలో జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు సుహాసిని, హనుమాన్‌నాయక్, జెడ్పీ డిప్యూటీ సీఈఓ సరిత, డీఆర్‌డీఓ వసంత, డీఏఓ రామారావు నాయక్, డీఎం సీఎస్ హతీరాం, డీసీఎస్‌ఓ సరస్వతి, డీడబ్ల్యూఓ ఫ్లోరెన్స్ తదితరులు పాల్గొన్నారు.

వేగంగా వెళ్తున్నారా.. జాగ్రత్త!

- నిడిగొండ వద్ద స్పీడో మీటర్
- ప్రమాదాల నియంత్రణకు ఏర్పాటు



నిడిగొండ వద్ద ఏర్పాటు చేసిన స్పీడో మీటర్

రఘునాథపల్లి: మండలంలోని నిడిగొండ వద్ద బైపాస్ రహదారిపై ప్రమాదాల నియంత్రణకు భారత జాతీయ రహదారుల అథారిటీ(ఎన్‌హెచ్‌ఏఐ) చర్యలు చేపట్టింది. నిడిగొండ పెట్రోల్ బంక్ సమీప క్రాసింగ్ వద్ద స్పీడో మీటర్ ఏర్పాటు చేశారు. బైపాస్ రహదారిపై పరిమిత వేగం గంటకు 80 కిలో మీటర్లు.. అంతకంటే ఎక్కువ స్పీడుతో వెళ్లే వాహనాలకు ఆటోమెటిక్‌గా ఫెనాల్టీ పడుతుంది. వాహనదారులు అతివేగంగా వెళ్తుండడంతో నిడిగొండ వద్ద తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. పలువురు ప్రాణాలు కొల్పోగా.. అనేక మంది క్షతగాత్రులయ్యారు. ఈ నేపథ్యంలో ప్రమాదాలకు చెక్ పెట్టేలా వాహనాల వేగ నియంత్రణకు చర్యలకు ఉపక్రమించారు. ఈ మార్గంలో వెళ్లే వారు నిర్ణీత వేగం దాటితే జరిమానా తప్పదని అధికారులు హెచ్చరిస్తున్నారు. నిడిగొండ గ్రామస్తులు మాత్రం.. ఇక్కడ అండర్‌పాస్ నిర్మించాలని డిమాండ్ చేస్తున్నారు.

ఎర్త్ ఫౌండేషన్ సేవలు విద్యార్థులకు వరం

- ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి



ఎర్త్ ఫౌండేషన్ సేవల ప్రారంభం అనంతరం విద్యార్థులతో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

జనగామ: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఎర్త్ ఫౌండేషన్ ద్వారా అందించనున్న సేవలు వరంగా మారుతాయని ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం రైల్వేస్టేషన్ ఏరియా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎర్త్ ఫౌండేషన్ స్కిల్స్ ప్రోగ్రాం కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. జిల్లాలోని ఉన్నత పాఠశాలల్లో చదువుకుంటున్న వెయ్యి మంది విద్యార్థులకు ఉచితంగా కంప్యూటర్, సైన్స్ ఆన్ వీల్స్, మోటివేషన్ తరగతులు, ఆటల్లో శిక్షణ అందిచనున్నట్లు పేర్కొన్న ఎమ్మెల్యే.. శ్రద్ధగా నేర్చుకోవాలని సూచించారు. ఈ సేవలను జిల్లాలోని మరిన్ని పాఠశాలలకు విస్తరించేలా చూడాలన్నారు. ఫౌండేషన్ డైరెక్టర్ మంగళ్లపల్లి రాజు మాట్లాడుతూ విద్యార్థులకు ఉచితంగా సేవలందించే విషయంలో ఎమ్మెల్యే ప్రోత్సాహం మరువలేమని, రాబోయే రోజుల్లో సేవలను విస్తృతం చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం కృష్ణమూర్తి, ఫౌండేషన్ కోఆర్డినేటర్ బి.ఆంజనేయులు, తుంగ కౌశిక్, కౌన్సిలర్లు ముస్త్యాల దయాకర్, తాళ్ల సురేష్‌రెడ్డి, ఉల్లెంగుల సందీప్, గుర్రం నాగరాజు, యాకూబ్, దేవునూరి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

అర్హత లేకున్నా వైద్యసేవలు..

- కంచనపల్లిలో క్లినిక్‌పై దాడులు
- 40 రకాల మందులు స్వాధీనం
- నిర్వాహకుడిపై క్రిమినల్ కేసు నమోదు



స్వాధీనం చేసుకున్న మందులు చూపిస్తున్న ఔషధ నియంత్రణ అధికారులు

రఘునాథపల్లి: కంచనపల్లికి చెందిన ఈశ్వరయ్య అనే వ్యక్తి అర్హత లేకపోయినా గ్రామంలో వైద్య సేవలు అందిస్తూ అల్లోపతి మందులను నిల్వ చేశాడు. పక్కా సమాచారంతో జనగామ, వరంగల్ జిల్లాల ఔషధ నియంత్రణ అధికారులు ఏలె బాలకృష్ణ, అరవింద్ క్లినిక్‌పై సోమవారం దాడులు నిర్వహించారు. అక్రమంగా నిల్వ చేసిన రూ.25వేల విలువైన 40 రకాల అల్లోపతి మందులను సీజ్ చేశారు. వాటిని జనగామ కోర్టులో జ్యూడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ముందు సమర్పించనున్నట్లు అధికారులు తెలిపారు. అర్హత లేని వైద్యునిపై సెక్షన్ 18సీ డ్రగ్స్ అండ్ కాస్మొటిక్స్ యాక్ట్ 1940 ప్రకారం క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. డ్రగ్స్ లైసెన్స్ లేకుండా మందులు నిల్వ ఉంచితే చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. ఔషధ నియంత్రణ శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ రాజ్యలక్ష్మి పర్యవేక్షణలో నిర్వహించిన ఈ దాడుల్లో రఘునాథపల్లి పీహెచ్‌సీ హెల్త్ అసిస్టెంట్లు విష్ణువర్ధన్‌రెడ్డి, ఎంపీహెచ్‌ఏ కె.రాణి పాల్గొన్నారు.

క్రిస్మస్ సందడి





- ముస్తాబైన ప్రార్థనా మందిరాలు

లోక రక్షకుడు.. ఏసుక్రీస్తు పుట్టిన రోజు వేడుకలను ఘనంగా జరుపుకునేందుకు జిల్లాలోని క్రైస్తవులు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఈ నెల 25న క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని ప్రార్థనా మందిరాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఇళ్ల ఎదుట నక్షత్రాలు, ఇళ్లలో క్రిస్మస్ ట్రీలు ఏర్పాటు చేశారు. ఇప్పటికే ఆరాధకులు సంబురాలను ప్రారంభించారు. నృత్యాలు, శాంతి సందేశాలు, ప్రేమ సూక్తులు వినిపిస్తున్నాయి. ఇదిలా ఉండగా.. శాంతా క్లాజ్, మేరీమాత బొమ్మలతోపాటు స్టార్లు, ట్రీలు, విద్యుత్ దీపాలు తదితర కొనుగోళ్లు జోరుగా సాగుతున్నాయి. ఫ్యాన్సీ స్టోర్లు జనంతో కిటకిటలాడుతున్నాయి. – జనగామ



జనగామలోని సెయింట్ పాల్స్ స్కూల్‌లో క్రిస్మస్ సంబురాలు



క్రిస్మస్ స్టార్లు, ట్రీలు, విద్యుత్ బల్బుల అమ్మకాలు

అధిక సాంద్రత సాగు లాభదాయకం

- ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ అనిల్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న అనిల్‌కుమార్

చిల్పూరు: అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగు లాభదాయకమని ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ అనిల్‌కుమార్ అన్నారు. చిన్నపెండ్యాలలో సోమవారం యాదాద్రి భువనగిరి జిల్లా ఏరువాక కేంద్రం ఆధ్వర్యాన ఏఓ నజీరుద్దీన్ అధ్యక్షతన నిర్వహించిన రైతు శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. అధిక సాంద్రత పత్తి సాగులో మొక్కలు, వరుసల మధ్య దూరం తగ్గించి ఎకరాకు 25 వేల నుంచి 35 వేల మొక్కలు వచ్చేలా విత్తుకోవాలన్నారు. ఈ పద్ధతిన వర్షాధారంగా ఎకరాకు 9–13 క్వింటాళ్ల దిగుబడి పొందవచ్చని, రైతులకు కేంద్ర ప్రభుత్వం ప్రోత్సాహకంగా రూ.5,000 ఖాతాలో జమచేస్తుందని చెప్పారు. శాస్త్రవేత్తలు మమత, మధుశేఖర్, దేశ్పాండే ఫౌండేషన్ మేనేజర్ వెంకటేశ్వర్లు, శరత్ బాబు, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

భయం భయంగా..

అడవుల్లో పెద్దపులి సంచారం

- జాడ గుర్తించని అటవీ అధికారులు
- జంకుతున్న పశువుల కాపరులు
- గిరిజన గ్రామాల్లో ప్రజల ఆందోళన



పులి జాడ కోసం వెతుకుతున్న అధికారులు

ఎస్ఎస్‌తాడ్వాయి: ములుగు జిల్లా ఎస్ఎస్‌తాడ్వాయి మండల పరిధి అటవీ ప్రాంతాల గిరిజన ప్రజలను పెద్దపులి భయం వేటాడుతోంది. వారం రోజుల నుంచి అడవుల్లో పెద్దపులి సంచరిస్తున్నట్లు దాని పాదముద్రల ద్వారా అటవీశాఖ అధికారులు గుర్తించారు. తొలుత పంబాపూర్, నర్సాపూర్ అటవీ ప్రాంతంలో సంచరించినట్లు గుర్తించిన అధికారులు రెండు రోజుల క్రితం బంధాల, లింగాల అటవీ ప్రాంతంలో తిరిగినట్లు పాదముద్రలను గుర్తించారు. పులి జాడ కోసం వెతుకుతున్నారు. బంధాల అడవుల్లో పులి సంచరిస్తున్నదా.. ఎటువైపు వెళ్లిందనే కోణంలో అన్వేషిస్తున్నారు. సోమవారం రంగాపూర్, బీరెల్లి, గంగారం, లింగాల, బంధాల అటవీ ప్రాంతాల్లో టీంల వారీగా పెద్దపులి ఆచూకీ కోసం గాలించినా పాదముద్రలు లభించలేదని రేంజ్ అధికారి కోట సత్తయ్య తెలిపారు.

అధికారులకు తలనొప్పిగా..

అటవీశాఖ అధికారులకు పెద్దపులి సంచారం తలనొప్పిగా మారింది. కొద్ది రోజులుగా పులి జాడ కోసం అధికారులు టీంలుగా ఏర్పడి అటవీ ప్రాంతంలో గాలిస్తున్నారు. మండలంలోనే పులి సంచరిస్తున్నట్లు పాదముద్రలను గుర్తించిన అధికారులు తిరిగి తాడ్వాయి అడవుల నుంచి ఎక్కడికి వెళ్లిందనే విషయాన్ని తెలుసుకునేందుకు ఫారెస్ట్‌లో తిరుగుతున్నారు. రెండు రోజుల క్రితం బంధాల, లింగాల అటవీ ప్రాంతంలో పులి అడుగులను గుర్తించారు. అయితే.. పులి ఎక్కడికి వెళ్లిందనే ఆనవాళ్లు లభించకపోవడంతో తలలు పట్టుకుంటున్నారు. ఇదిలా ఉండగా.. ఫారెస్ట్ అధికారులు పులి పాదముద్రలను గుర్తించడంతో అటవీ ఉత్పత్తుల సేకరణకు అడవికి వెళ్లేందుకు గిరిజనులు జంకుతున్నారు. అడవి సమీప గ్రామాల ప్రజలు రాత్రి సమయాల్లో పులి వస్తుందని భయపడుతున్నారు. దీంతో పలువురు పశువుల కాపారులు అడవికి వెళ్లడం లేదు. యజమానులే ఇంటి దగ్గర వాటిని కట్టేస్తున్నారు.

క్లుప్తంగా

రైల్వే ఇంజనీరింగ్ బ్లాక్‌తో పలు రైళ్ల రద్దు

రేపటి నుంచి జనవరి 9వ తేదీ వరకు..

కాజీపేట రూరల్ : వరంగల్-విజయవాడ మధ్య మోట మర్రి సెక్షన్‌లో మూడో రైల్వే లైన్, ఇంజనీరింగ్ బ్లాక్‌తో ఈ నెల 25వ తేదీ (రేపటి) నుంచి 2025 జనవరి 9వ తేదీ వరకు కాజీపేట, వరంగల్ రైల్వే స్టేషన్ల మీదుగా ప్రయాణించే పలు రైళ్లను రద్దు చేసినట్లు కాజీపేట రైల్వే అధికారులు సోమవారం తెలిపారు.

రద్దయిన రైళ్ల వివరాలు..

ఈ నెల 25వ తేదీ నుంచి జనవరి 9వ తేదీ వరకు కాజీపేట-డోర్నకల్ (07753) ప్యాసింజర్, డోర్నకల్-కాజీపేట (07754) ప్యాసింజర్, డోర్నకల్-విజయవాడ (07755) ప్యాసింజర్, విజయవాడ-డోర్నకల్ (07756) ప్యాసింజర్, విజయవాడ-భద్రాచలంరోడ్ (07979) ప్యాసింజర్,భద్రాచలంరోడ్-విజయవాడ (07278) ప్యాసింజర్ రైళ్లు రద్దయ్యాయి.

28వ తేదీ నుంచి మరికొన్ని రైళ్లు..

ఈ నెల 28 నుంచి జనవరి 9వ తేదీ వరకు గుంటూరు-సికింద్రాబాద్ (12705) ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్-గుంటూరు (12706) ఎక్స్‌ప్రెస్, విజయవాడ-సికింద్రాబాద్ (12713) ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్-విజయవాడ (12714) రైళ్లు రద్దయ్యాయి. ఇవే కాకుండా కాజీపేట, వరంగల్ రైల్వే స్టేషన్ మీదుగా ప్రయాణించే మొత్తం 28 రైళ్లు రద్దు, 23 రైళ్లు దారిమళ్లింపు, 3 రైళ్లు రీషెడ్యూల్, కాజీపేట, వరంగల్‌లో 14 రైళ్లకు తాత్కాలిక హాల్టింగ్ ఎత్తివేత, 2 రైళ్లను పార్శిల్లీ రద్దు చేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.

వరంగల్ మార్కెట్‌కు రెండు రోజులు సెలవు

వరంగల్: క్రిస్మస్ సందర్భంగా వరంగల్ వ్యవసాయ మార్కెట్‌కు రెండు రోజులు సెలవు ఉందని, ఈ సమయంలో ఎలాంటి క్రయ, విక్రయాలు జరగవని మార్కెట్ కార్యదర్శి పి.నిర్మల సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 25వ తేదీ క్రిస్మస్, 26వ తేదీ బాక్సింగ్ డే ఉన్న నేపథ్యంలో మార్కెట్ బంద్ ఉంటుందన్నారు. ఈవిషయాన్ని రైతులు, వ్యాపారులు గమనించి తమ పంట ఉత్పత్తులను మార్కెట్‌కు తీసుకురావొద్దని తెలిపారు.


పీహెచ్‌డీ అడ్మిషన్లు కల్పించాలి



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో తమకు పీహెచ్‌డీలో అడ్మిషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ ముగ్గురు అభ్యర్థులు మంద నరేశ్, ఎస్.అనిల్, మాలోత్ తిరుపతి నాయక్ సోమవారం ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మల్లారెడ్డితో వాగ్వాదానికి దిగారు. పీహెచ్‌డీ అడ్మిషన్ల ప్రక్రియ ఇప్పటికే పూర్తయిందని, ప్రస్తుతం అడ్మిషన్ల ప్రక్రియ తమ పరిధిలో లేదని మల్లారెడ్డి పేర్కొన్నారు. అనంతరం ముగ్గురు అభ్యర్థులు వీసీ చాంబర్‌లో ఆమరణ దీక్షకు దిగారు. వీసీ ప్రతాప్‌రెడ్డి ఆ అభ్యర్థులతో మాట్లాడారు. ఇప్పుడు పీహెచ్‌డీ అడ్మిషన్లు కల్పించడం తన చేతిలోలేదన్నారు. ఉన్నత విద్యాశాఖ నుంచి అనుమతి తెచ్చుకుంటేనే అవకాశం ఉంటుందన్నారు. అయితే తమకు అడ్మిషన్లు కల్పించాల్సిందేనని పట్టుబడుతూ నిరసన తెలిపారు. దీంతో కేయూ సీఐ రవికుమార్, ఎస్సై రవీందర్ ఘటనాస్థలికి చేరుకుని అభ్యర్థులను బయటకు తీసుకొచ్చి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం విడుదల చేశారు.



విద్యుత్ దీపాల వెలుగుల్లో దీవి



పర్యాటకులు కూర్చునేందుకు మంచె

బ్లాక్‌బెర్రీ ముస్తాబు..

తాడ్వాయి అడవుల్లో టూరిజం స్పాట్

- మరికొద్ది రోజుల్లోకి అందుబాటులోకి..
- ఆధునిక గుడారాలు ఏర్పాటు..
- ఇసుక మేటల మీద క్యాంప్‌ఫైర్
- బీచ్ వాలీబాల్ తరహా ఆటలకు అవకాశం



ఫారెస్ట్‌లోని బ్లాక్‌బెర్రీ దీవిలో ఇసుక తిన్నెపై ఏర్పాటు చేసిన పర్యాటక గుడారాలు

ఎస్ఎస్‌తాడ్వాయి: చుట్టు ఎత్తైన కొండలు.. కొండల మధ్య నది.. నదిపై పడవలో ప్రయాణం. ఈ అనుభూతి మాటల్లో వర్ణించలేం. బోటులో ప్రయాణిస్తూ కనుచూపు మేర ఉన్న ప్రకృతి అందాలకు పర్యాటకులు ఫిదా కావాల్సిందే. ఇలాంటి సుందర దృశ్యానికి కేరాఫ్ పాపికొండలు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రెండు తెలుగు రాష్ట్రాల్లో పర్యాటకులకు ఈ పర్యటన ఎంతో ప్రసిద్ధి. ఎత్తైన పాపికొండలపై పరుచుకున్న దట్టమైన అడవిలో గోదావరి నది ఇసుక తిన్నెల్లో బస చేసే కొల్లూరు హట్స్ ఎంతో ప్రసిద్ధి. అయితే కచ్చలూరు ఘటన తర్వాత ఈ హట్స్‌ను తీసేశారు. ఈ నేపథ్యంలో ఇప్పుడు పర్యాటకులకు ఆ లోటును తాడ్వాయి అడవుల్లోని బ్లాక్‌బెర్రీ ఫారెస్ట్ భర్తీ చేస్తోంది. తాడ్వాయి - పస్రా మధ్యలో ఉన్న ఏటూరునాగరం అభయారణ్యంలో జలగలంచ వాగు సమీపంలో ఎకోటూరిజంలో భాగంగా అధికారులు గుడారాలను అభివృద్ధి చేశారు. ఇసుక మధ్యలో 50 ఆధునిక గుడారాలు సిద్ధమయ్యాయి. వాగులోని ఇసుక మేటల మీద క్యాంప్‌ఫైర్ అనుభూతిని పొందొచ్చు. బీచ్ వాలీబాల్ తరహా ఆటలకు అవకాశం కల్పించారు. పర్యాటకులు ప్రకృతిలో సేదదీరేలా అన్ని హంగులు రెడీ అవుతున్నాయి. మరికొద్ది రోజుల్లో అందుబాటులోకి రానుంది. రామప్ప, లక్నవరం, మేడారం, బొగతా, మల్లూరు వెళ్లే పర్యాటకులు ఇక్కడ ఒక రోజు విడిది చేసి వచ్చని ప్రకృతిలో చక్కని అనుభూతులు సొంతం చేసుకోవచ్చు.

పర్యాటక ప్రాంతంగా బ్లాక్ బెర్రీ దీవి..



బ్లాక్ బెర్రీ దీవిలో చలిమంటలు కాగుతున్న మంత్రి సీతక్క

అటవీ ప్రాంతంలోని బ్లాక్ బెర్రీ దీవిని పర్యాటకంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క తెలిపారు. ఈ మేరకు సోమవారం రాత్రి బ్లాక్ బెర్రీ దీవిని మహబూబాబాద్ ఎంపీ బలరాంనాయక్, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, కలెక్టర్ దివాకర్ టీఎస్‌తో కలిసి సందర్శించారు. పర్యాటకుల కోసం ఏర్పాటు చేస్తున్న గుడారాలు, క్యాంప్‌ఫైర్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో ఐటీడీఏ పీఓ చిత్ర మిశ్రా, డీఎఫ్ఓ రాహుల్ కిషన్ జాదవ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవీందర్, తదితరులు పాల్గొన్నారు.



ఏర్పాటు చేసిన రెస్టారెంట్



స్వాగతద్వారం వద్ద విద్యుత్ వెలుగులు



విద్యుత్ వెలుగుల్లో పర్యాటక గుడారాలు

స్మగ్లర్‌ను హీరో చేశారు.. పోలీసులను విలన్ చేశారు..

- మంత్రి డాక్టర్ ధనసరి సీతక్క

ములుగు: ఒక స్మగ్లర్ పోలీసును బట్టలు విప్పి నిలబెడితే జాతీయ అవార్డులు ఇవ్వడం దేనికి సంకేతం.. స్మగ్లర్‌ను హీరో చేశారు.. పోలీసులను విలన్ చేశారని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి సీతక్క అన్నారు. ములుగులో సోమవారం జరిగిన క్రిస్మస్ వేడుకల సందర్భంగా ఆమె మాట్లాడారు. సినిమా హాల్‌లో జరిగిన తొక్కిసలాటలో మహిళ మృతి చెందిన ఘటనను ఆసరాగా తీసుకొని బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు సెంటిమెంట్‌ను వాడుకునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. రాజకీయ ప్రయోజనం కోసం బీఆర్ఎస్ ముసుగులో సినీ హీరో అల్లు అర్జున్ ఇంటిపై రాళ్లు రువ్వి కొంత మంది రాద్ధాంతం చేయజూస్తున్నారని మండిపడ్డారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం తరఫున అండగా ఉంటామని, అల్లు అర్జున్‌పై తమకు ఎలాంటి కోపం లేదన్నారు. లంగతనాలు, దొంగతనాలపై తీసే సినిమాలపై ఎవరూ సానుకూలంగా స్పందించరని, తెలుగు సినీ ఇండస్ట్రీ ఇక్కడి నుంచి వెళ్లిపోవాలని చూడడం లేదని తెలిపారు.

రేవంత్ పాలనలో ఓరుగల్లుకు ఒరిగిందేమీ లేదు



మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు, పక్కన మాజీ ఎంపీ వినోద్‌కుమార్, మాజీ ఎమ్మెల్యేలు దయాకర్‌రావు, వినయ్‌భాస్కర్, సుదర్శన్ రెడ్డి, నరేందర్, శంకర్‌నాయక్

- సూపర్ ఆస్పత్రి నిర్మాణంలో నిర్లక్ష్యం సరికాదు
- 14 నెలల్లో ఒక్క శాతం పని కూడా పూర్తి కాలేదు
- మాజీ మంత్రి హరీశ్‌రావు

ఎంజీఎం : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంవత్సర పాలన కాలంలో ఓరుగల్లు ఒరిగిందేమీ లేదని మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. కేసీఆర్ మొదలుపెట్టిన సూపర్ ఆస్పత్రి ప్రారంభిస్తే మంచి పేరు వస్తుందనే భావనతో 14 నెలల కాలంలో ఒక్క శాతం పనులు కూడా పూర్తి చేయలేదని విమర్శించారు. సోమవారం సెంట్రల్ జైలు ప్రాంగణంలోని సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణ పనులను మాజీ ఎంపీ వినోద్‌కుమార్, మాజీ ఎమ్మెల్యేలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణ పనులు పూర్తయితే ఒకేసారి 150 మందికి ఐసీయూ చికిత్సలు అందుతాయన్నారు. ఉత్తర తెలంగాణ జిల్లాలకు ప్రజలకు అవయవ మార్పిడి శస్త్రచికిత్సలు జరిగేలా 33 ఆపరేషన్ థియేటర్లు అందుబాటులోకి వస్తాయన్నారు. 2023 అక్టోబర్‌లో పనులు సందర్శించినప్పుడు ఏ విధంగా ఉందో ప్రస్తు తం ఆ విధంగానే ఉందని తెలిపారు. అప్పటికే 84 శాతం ఆస్పత్రి పనులు పూర్తయినట్లు పేర్కొన్నారు. మొదట్లో ఆస్పత్రి నిర్మాణ పనులను 1,750 పడకలు, 16 లక్షల ఎస్ఎఫ్‌టీ(స్క్వేర్ ఫీట్) అనుకున్నా తరువాత కేసీఆర్ నిర్ణయం మేరకు 2,000 పడకలు, 20.50 లక్షల ఎస్ఎఫ్‌టీ మార్చినట్లు పేర్కొన్నారు. అలాగే, ఎంజీఎం నిర్వహణ అస్తవ్యస్తంగా మారిందన్నారు. ఈ దుస్థితిపై రోజూ వివిధ పత్రికల్లో కథనలు వెలువడుతున్నాయన్నారు. అయినా ప్రభుత్వం ఆ సమస్యలను పట్టించుకోదు..సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణాన్ని పూర్తి చేయదని విమర్శించారు.



ఆస్పత్రి నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

ప్రశ్నిస్తే కేసులు పెడుతున్నారు..

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అన్ని పథకాలను బంద్ చేశారని హరీశ్‌రావు పేర్కొన్నారు. దళిత బంధు, చేప పిల్లల పంపిణీ, కేసీఆర్ కిట్, న్యూట్రీషియన్ కిట్టు, రైతుబంధు.. ఇలా బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన అన్ని పథకాలు బంద్ చేసి కాంగ్రెస్ దద్దమ్మ పాలన సాగిస్తుందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అసమర్థతను ప్రశ్నిస్తే బీఆర్ఎస్ నాయకులపై విచారణ, కమిషన్ పేరుతో కేసులు పెడుతూ దుర్మార్గపు పాలన సాగిస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్‌లో ఎంతో మంది సీనియర్లు ఉన్నా ఎన్నో పార్టీలు మారిన రేవంత్‌రెడ్డి అందరిని అణగదొక్కుతూ సీఎం కుర్చీలో కూర్చున్నారని విమర్శించారు. రాజస్థాన్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన 24 అంతస్తుల నిర్మాణ పనులను ప్రస్తుత బీజేపీ ప్రభుత్వం యథావిధిగా చేపడుతుందనే విషయాన్ని గుర్తు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు దయాకర్‌రావు, వినయ్ భాస్కర్, నరేందర్, సుదర్శన్‌రెడ్డి, శంకర్‌నాయక్, నాయకులు దాచేపల్లి సీతారాం, దిడ్డి కుమారస్వామి, రమేశ్‌బాబు, ఎండి. షఫీ తదితరులు పాల్గొన్నారు.

వంశీ మృతదేహాన్ని తెప్పించే ప్రయత్నం చేస్తా

- కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్

కమలాపూర్: అమెరికాలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన వంశీ మృతదేహాన్ని వీలైనంత త్వరగా స్వగ్రామానికి తెప్పించే ప్రయత్నం చేస్తానని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ హామీ ఇచ్చారు. ఈ మేరకు కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి సుబ్రహ్మణ్యం జయశంకర్‌కు లేఖ రాశారు. హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం మాదన్నపేటకు చెందిన బండి వంశీ ఉన్నత చదువు కోసం 2022 ఆగస్టులో అమెరికాకు వెళ్లి గత శనివారం అక్కడే అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన విషయం తెలిసిందే. కాగా, వంశీ కుటుంబాన్ని బీజేపీ మండల నాయకులు సోమవారం పరామర్శించి సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌ను ఫోన్‌లో సంప్రదించి వంశీ కుటుంబ సభ్యులతో మాట్లాడించారు. బీజేపీ మండల అధ్యక్షుడు అశోక్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి శోభన్‌బాబు, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి కోటేశ్వర్, మైనార్టీ మోర్చా మండల అధ్యక్షుడు రాజ్‌మహ్మద్, తదితరులు పాల్గొన్నారు.



వంశీ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న బీజేపీ నాయకులు

ఆర్టీసీ బస్సుకు తప్పిన పెనుప్రమాదం

- నిర్మాణంలో ఉన్న అండర్‌పాస్ బ్రిడ్జికి ఢీ..
- పలువురు ప్రయాణికులకు స్వల్ప గాయాలు
- యాదగిరిగుట్ట మండలం వంగపల్లి వద్ద ఘటన



అండర్‌పాస్ బ్రిడ్జి పైకి దూసుకెళ్లిన బస్సు

యాదగిరిగుట్ట రూరల్: హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారిపై యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం వంగపల్లి గ్రామం వద్ద నిర్మాణంలో ఉన్న అండర్‌పాస్ బ్రిడ్జి పైకి ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సు దూసుకెళ్లి ఆగిపోయింది. ఈ ప్రమాదంలో పలువురు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. వరంగల్-2 డిపోనకు చెందిన ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సు సోమవారం ఉదయం హైదరాబాద్ నుంచి హనుమకొండకు 33 మంది ప్రయాణికులతో బయలుదేరింది. మార్గమధ్యలో యాదగిరిగుట్ట మండలం వంగపల్లి గ్రామం వద్దకు రాగానే అండర్‌పాస్ బ్రిడ్జి పైకి అదుపుతప్పి దూసుకెళ్లింది. ఇనుప చువ్వలను తాకి నిలిచిపోయింది. దీంతో ప్రయాణికులు ఒకరిమీద ఒకరు పడడంతో స్వల్ప గాయాలయ్యాయి. దీంతో 108 వాహనంలో ఆస్పత్రికి తరలించారు. ఈ ప్ర మాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. జాతీయ రహదా రిపై సరైన ఇండికేషన్ లేకపోవడంతోనే ప్రమాదం జరిగిందని ప్రయాణికులు ఆరోపించారు.

శాస్త్ర సాంకేతికతను అందిపుచ్చుకోవాలి



ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆయిల్‌పామ్ ప్రదర్శన



కిసాన్ మేళా, వ్యవసాయ ప్రదర్శనకు హాజరైన రైతులు

- భారత వ్యవసాయ పరిశోధన మండలి డైరెక్టర్ షేక్.ఎస్.మీరా
- మల్యాల కేవీకేలో ఘనంగా కిసాన్ మేళా, వ్యవసాయ ప్రదర్శన

మహబూబాబాద్ రూరల్ : రైతులు వ్యవసాయంలో యాంత్రీకరణ పాటిస్తూ శాస్త్ర సాంకేతిక రంగాల్లో అభివృద్ధి చెందడానికి కృషి చేయాలని భారత వ్యవసాయ పరిశోధన మండలి (హైదరాబాద్ అటారీ జోన్ 10) డైరెక్టర్ డాక్టర్ షేక్.ఎస్.మీరా అన్నారు. జాతీయ రైతు దినోత్సవం సందర్భంగా సోమవారం మహబూబాబాద్ మండలంలోని మల్యాల కృషి విజ్ఞాన కేంద్రంలో కిసాన్ మేళా, వ్యవసాయ ప్రదర్శన ఘనంగా నిర్వహించారు. మొదట కేవీకేలో మట్టి పరీక్ష కేంద్రం, సమీకృత వ్యవసాయ పాఠశాల కేంద్రం, వర్మి కంపోస్టు ప్రదర్శనశాలను ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మీరా మాట్లాడారు. ప్రస్తుతం వరి, పత్తి, మిరప, మొక్కజొన్నతో పాటు ఇటీవల ఆయిల్ పామ్ సాగుపై కూడా రైతులు దృష్టి కనబరుస్తున్నారని, ఇది శుభపరిణామమని పేర్కొన్నారు. రైతులకు శాస్త్ర సాంకేతిక రంగాల్లో అవసరమైన సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో పీజేటీఎస్ఏయూ విస్తరణ సంచాలకురాలు జమునారాణి, వరంగల్ ఆర్ఏఆర్ఎస్ సహ పరిశోధన సంచాలకుడు ఉమారెడ్డి, ప్రిన్సిపల్ సైంటిస్టులు వెంకన్న, వీరన్న, రాజన్న, మల్యాల కేవీకే సమన్వయకర్త ఎస్.మాలతి, శాస్త్రవేత్తలు కిశోర్ కుమార్, రాంబాబు, క్రాంతికుమార్, అభ్యుదయ రైతులు వల్లూరి కృష్ణారెడ్డి, గోపాల్ రెడ్డి, యాదగిరి, జిల్లా వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు విజయనిర్మల, మరియన్న, మల్యాల హెచ్ఆర్ఎస్ శాస్త్రవేత్త ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర గంజాయి ముఠా అరెస్ట్

- రూ. 40 లక్షల విలువైన గంజాయి పట్టివేత
- వివరాలు వెల్లడించిన భూపాలపల్లి ఎస్పీ కిరణ్ ఖరే

భూపాలపల్లి: అంతర్రాష్ట్ర ముఠాను అరెస్ట్ చేసి భారీ స్థాయిలో గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు జయశంకర్ భూపాలపల్లి ఎస్పీ కిరణ్ ఖరే తెలిపారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. కొందరు వ్యక్తులు ఆంధ్రప్రదేశ్ నుంచి భూపాలపల్లి జిల్లాకు గంజాయి రవాణా చేస్తున్నట్లు సమాచారం అందింది. ఈ మేరకు గణపురం ఎస్సై అశోక్ ఠాణా పరిధిలోని రవినగర్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలో అటువైపు వస్తున్న ఓ కారును ఆపి తనిఖీ చేయగా అందులో రూ. 40 లక్షల విలువైన 160 కిలోల గంజాయి లభ్యమైంది. దీంతో కారులో ఉన్న ఏపీలోని తూర్పు గోదావరి జిల్లాకు చెందిన తోట మాధవరావు, ఒడిశాకు చెందిన భీమ్‌ప్రసాద్, సోమరుటాక్రీ, విశాఖపట్టణానికి చెందిన మక్కువ మోసిన్‌ను అరెస్ట్ చేశారు. నిందితులు ఏపీలోని అల్లూరి సీతారామరాజు జిల్లా దారకొండ గ్రామానికి చెందిన బాబురావు వద్ద గంజాయిని తక్కువ ధరకు కొనుగోలు చేసి భూపాలపల్లిలో విక్రయించేందుకు వస్తున్నట్లు తెలిపారు. కాగా, నిందితులను పట్టుకోవడంలో సమర్థవంతంగా విధులు నిర్వర్తించిన భూపాలపల్లి డీఎస్పీ సంపత్‌రావు, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, చిట్యాల సీఐ మల్లేశ్, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.



భూపాలపల్లి: నిందితుల అరెస్ట్ చూపి వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ కిరణ్ ఖరే

గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

డోర్నకల్: గంజాయి తరలిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసి అతడి వద్ద నుంచి ఏడు కిలోల సరుకును స్వాధీనం చేసుకున్నట్లు డోర్నకల్ ఎస్సై గడ్డం ఉమ సోమవారం తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. రైల్వే స్టేషన్ ప్రాంతంలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఓ వ్యక్తి బ్యాగుతో అనుమానాస్పదంగా తిరుగుతున్నాడు. దీంతో అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా గంజాయి లభించింది. సదరు వ్యక్తిని విచారించగా ఏపీలోని విశాఖపట్టణం జిల్లా జీకే వీధి మండలం దుప్పలవాడకు చెందిన కిముడు గోపిగా తేలింది. సులువుగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో గోపి తన స్నేహితుడు ప్రవీణ్‌కుమార్ సంప్రదించాడు. దీనికి అతను గంజాయి విక్రయాలు చేపట్టాలని పేర్కొని ఒడిశాలోని చిత్రకొండ ప్రాంతం నుంచి ఆరు ప్యాకెట్ల గంజాయి కొనుగోలు చేసి గోపికి అందించాడు. అనంతరం ఆ గంజాయిని గోపికి ఇచ్చి వరంగల్‌లోని ఓ వ్యక్తికి ఇస్తే డబ్బు ఇస్తాడని తెలపడంతో గోపి ఖమ్మం వరకు బస్సులో వచ్చాడు. అక్కడి నుంచి ఓ రైలులో వరంగల్ బయలుదేరాడు. ఈ క్రమంలో రైలులో పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండడంతో డోర్నకల్‌లో దిగిన గోపి పోలీసులకు పట్టుబడ్డాడు. పట్టుబడిన గంజాయి విలువ రూ.1,75,000 ఉంటుంది. గంజాయితో పాటు రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో మరో నిందితుడు విశాఖ జిల్లాకు చెందిన ప్రవీణ్‌కుమార్ పరారీలో ఉన్నట్లు ఎస్సై ఉమ తెలిపారు.

ఆర్థిక సంస్కరణల పితామహుడు పీవీ



కేయూ క్యాంపస్: పీవీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ మల్లారెడ్డి తదితరులు



హనుమకొండ బస్టాండ్ జంక్షన్‌లోని పీవీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీ కావ్య, ఎమ్మెల్యేలు రాజేందర్‌రెడ్డి, నాగరాజు తదితరులు

- కేయూ వీసీ కె. ప్రతాప్‌రెడ్డి

కేయూ క్యాంపస్: ఆర్థిక సంస్కరణల పితామహుడు పీవీ నర్సింహారావు అని కాకతీయ యూనివర్సిటీ వీసీ కె. ప్రతాప్‌రెడ్డి అన్నారు. యూనివర్సిటీలోని పీవీ నాలెడ్జ్‌సెంటర్ డైరెక్టర్ జి. కృష్ణయ్య అధ్యక్షతన సోమవారం మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు 20వ వర్ధంతిని క్యాంపస్‌లోని పొలిటికల్ సైన్స్ విభాగ సెమినార్‌హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ క్లిష్ట సమయంలో దేశాన్ని ఆర్థిక గండం నుంచి గట్టెక్కించిన గొప్ప నేత పీవీ నర్సింహారావు అని కొనియాడారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ పి. మల్లారెడ్డి, పాలకమండలి సభ్యులు కె.అనితారెడి, ప్రొఫెసర్ బి. సురేశ్‌లాల్, డాక్టర్ చిర్ర రాజు, కేయూ దూరవిద్య కేంద్రం డైరెక్టర్ వి. రాంచంద్రం, కుర్తా అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎ. సదానందం, జనరల్‌సెక్రటరీ ప్రొఫెసర్ వడ్డె రవీందర్, ఆచార్యులు కె. సుధాకర్, పొలిటికల్ సైన్స్ విభాగం అధిపతి సంకినేని వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

పీవీకి ఘన నివాళి..

హన్మకొండ చౌరస్తా : హనుమకొండలోని డీసీసీ భవన్‌లో సోమవారం మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్ నేతలు.. పీవీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం హనుమకొండ బస్టాండ్ జంక్షన్‌లోని పీవీ కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వరంగల్ ఎంపీ కావ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, పీసీసీ సభ్యులు బత్తిని శ్రీనివాసరావు, బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఈవీ శ్రీనివాసరావు, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు బంక సరళ, కార్పొరేటర్ తోట వెంకటేశ్వర్లు, నాయకులు బంక సంపత్, బొమ్మతి విక్రమ్, బిల్ల రమణారెడ్డి, మహ్మద్ అంకూశ్, కుమార్, సురేందర్, రమేశ్, సతీశ్, హరిసింగ్, తదితరులు పాల్గొన్నారు.